

పోలీసులకు ఇచ్చిన వేలిముద్రల డివైజ్‌లు.. డీపీపీ 7 యాప్

# సంచార దొంగల ముఠాలకు చెక్!

- పోలీసుల చేతికి దొంగల వేలిముద్రల డివైజ్‌లు
- పోలీస్ స్టేషన్‌కు 4 చొప్పున కేటాయింపు
- క్షణాల్లో దొంగలను పట్టేవిధంగా డీపీపీ7 యాప్

(రాజమహేంద్రవరం సిటీ)

సంచార దొంగల ముఠాలకు చెక్ పెట్టేందుకు పోలీసులు సిద్ధమయ్యారు. రాష్ట్రంలో వివిధ జిల్లాలు తిరుగుతూ ప్రజల్లో కలిసిపోయి చాకచక్యంగా దొంగతనాలు చేసి మాయమయ్యే ముఠాల ఆటకట్టించేందుకు రాష్ట్ర పోలీసు శాఖ దొంగల వేలిముద్రలను గుర్తించే డివైజ్‌లను సిద్ధం చేసింది. వాటిని పోలీస్‌స్టేషన్‌కు 4 చొప్పున కేటాయించింది. గతంలో దొంగతనాలు జరిగితే క్లూస్ టీం వచ్చి వేలిముద్రలు సేకరించి, వాటిని తమ కార్యాలయానికి తీసుకువెళ్లి సిస్టమ్‌లో దాన్ని స్కాన్ చేసి పాత నేరస్తుల వేలిముద్రలతో వాటిని పోల్చి నిర్ధారణ చేసుకునేవారు. ఇప్పు కొత్తగా వచ్చిన వేలిముద్రల డివైజ్ వల్ల క్షణాల్లో దొంగలను గుర్తించొచ్చు. రాజమహేంద్రవరం అర్బన్ జిల్లా పోలీసులకు సుమారు 40 డివైజ్‌లు ఇచ్చారు. ఎక్కువశాతం క్రైమ్ పోలీసులకు కేటాయించారు. క్రైమ్ పోలీసులు నగరంలో ముఖ్యమైన ప్రాంతాల్లో ఎక్కువగా కొత్తవారు తిరిగే బస్టాండ్‌లు, రైల్వేస్టేషన్ సమీపాల్లోను, జాతీయ రహదారి జంక్షన్ల వద్ద పోలీసులు ఈ డివైజ్‌లతో తనిఖీలు చేస్తున్నారు. ఉదయం 5 నుంచి 8 గంటల వరకు, సాయంత్రం 4 నుంచి రాత్రి 8 గంటల వరకు ఈ తనిఖీలు చేస్తున్నారు. ఈ ప్రక్రియ అంతా రాజమహేంద్రవరం అర్బన్ జిల్లాలో అయితే ఎస్పీ షిమోషిబాజ్‌పాయ్ పర్యవేక్షణలో జరుగుతోంది. పోలీసులు వారి ఆండ్రాయిడ్ ఫోన్లలో డీపీపీ7 యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకుని దాని ద్వారా మంగళగిరిలో ఉన్న పోలీస్ క్లూస్ టీం సాంకేతిక విభాగంతో అనుసంధానమై ఉంటారు. రాష్ట్రంలో ఏ సెంటర్‌లోనైనా ఎవరిమీదైనా పోలీసులకు అనుమానం వస్తే వారిని ఆపి డివైజ్ స్కానర్‌లో వేలిముద్ర తీసుకుని డీపీపీ7 యాప్‌లో అప్‌లోడ్ చేస్తారు. వెంటనే ఆ వేలిముద్ర గల వ్యక్తి నేరస్తుడైతే అతను ఏ రాష్ట్రానికి చెందిన వాడైనా వెంటనే డేటా ఓపెన్ అవుతుంది. పోలీసులు అప్రమత్తమై అతన్ని అదుపులోకి తీసుకుంటారు. దీనిద్వారా సంచార దొంగలతోపాటు బ్లేడ్‌బ్యాచ్, గంజాయి ముఠాలు, దారిదోపిడీ దొంగల ఆటకట్టించవచ్చు.



అనుమానిత వ్యక్తుల వేలిముద్రలు చూస్తున్న పోలీసులు

## వేధింపుల కేసు విచారణలో అలసత్వం

# సీఐ భీమరాజుపై కేసు